క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



తెనాలి అర్బన్: మేడిబోయిన శేషయ్య జ్ఞాపకార్థం రైల్వేస్టేషన్ సమీపంలోని సాయిబాబా గుడి పక్కన చలివేంద్రాన్ని బీసీ సంక్షేమ సంఘం తెనాలి అధ్యక్షుడు మేడిబోయిన గంగా యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పేద ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి గురువారం మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు దానబోయిన సురేష్, మల్లెంపల్లి భీష్మ పాములు, మేకల శ్రీనివాసరావు, నల్లగొర్ల గంగాదేవి, మేడిబోయిన రమణ, రవికుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నెలాఖరులోపు ఇంటి పన్ను చెల్లిస్తే రాయితీ

తెనాలి అర్బన్: నెలాఖరులోపు ఇంటి పన్ను చెల్లిస్తే ప్రభుత్వం ఐదు శాతం రాయితీ పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని పురసేవ కేంద్రంలో ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నులు కట్టించుకోనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

తెనాలి రూరల్: తెనాలి బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. సాధారణంగా ఏపీ బార్ కౌన్సిల్ ఆదేశానుసారం ఏడాది కాలపరిమితితో ఎన్నికలు నిర్వహించి అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ఈ నేపథ్యంలో 2023–24 సంవత్సరానికి గాను ఎన్నిక కోసం సర్వసభ్య సమావేశాన్ని తెనాలి బార్ అసోసియేషన్ హాలులో గురువారం నిర్వహించారు. గత ఏడాది ఎన్నుకున్న కార్యవర్గాన్నే కొనసాగించాలని తీర్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా మందలపు వేణుగోపాలరావు, ఉపాధ్యక్షుడిగా కంచర్ల చంద్రశేఖర్, కార్యదర్శిగా హరిదాసు గౌరీశంకర్, జాయింట్ సెక్రటరీగా రావూరి దయాకిరణ్ తదితరులతో ఎగ్జిక్యూటివ్ బాడీ ఏర్పాటైంది. మరో ఏడాది పాటు కొనసాగుతుందని అధ్యక్షుడు వేణుగోపాలరావు తెలిపారు.

భవిత చిన్నారులకు ఉచిత వైద్యశిబిరం



తెనాలి: ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దత్తత తీసుకున్న బాలాజీరావుపేటలోని భవిత కేంద్రంలోని దివ్యాంగులైన పిల్లలకు గురువారం హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. హాస్పిటల్ డైరెక్టర్ గిరిబాబుతోపాటు వైద్యులు డాక్టర్ విజయసాగర్, డాక్టర్ సుధీర్, డాక్టర్ మంజీర పాల్గొన్నారు. పిల్లలకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన మందులు, సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమాన్ని హాస్పిటల్ మార్కెటింగ్ డైరెక్టర్ శ్యామ్‌కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు సునీల్, భవిత కేంద్రం ఇన్‌చార్జి సునీత పర్యవేక్షించారు.

అగ్నిప్రమాదంలో గొడ్ల చావిడి దగ్ధం

రేపల్లె: అగ్ని ప్రమాదంలో గొడ్ల చావిడి దగ్ధమై.. పశువులు గాయపడిన ఘటన మృత్యుంజయపాలెంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కేసన ఆంజనేయుల గొడ్ల చావిడి ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. రెండు గేదెలు, రెండు దూడలు తీవ్రంగా గాయపడ్డాయి. మండల పశువైద్యాధికారి ప్రవీణ్ వాటికి వైద్యసేవలు అందించారు. ఘటనా స్థలాన్ని సర్పంచ్ తిరుమలశెట్టి శివాజీ పరిశీలించి, బాధితులకు సాయం అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

సంక్షేమంతో పేదల జీవితాల్లో ఆర్థిక విప్లవం

- గత ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేసింది
- రుణమాఫీ హామీనిచ్చి నిలుపుకోలేదు
- రూ.25 వేల కోట్ల రుణాలను చెల్లిస్తున్న సీఎం జగన్
- వైఎస్సార్ ఆసరా సంబరాల ముగింపులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఆర్థిక విప్లవం ఫలితంగానే పేద, మధ్యతరగతి వర్గాల బతుకుబండి సజావుగా సాగిపోతోందని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రాష్ట్రంలోని 80 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్న స్వయం సహాయక సంఘాలకు వడ్డీ సహా రూ.25 వేల కోట్లకు చేరుకున్న రుణాల్లో ఇప్పటికి మూడు విడతలుగా రూ.19,145 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. నాలుగో విడత వచ్చే జనవరిలో ఇచ్చేందుకు బడ్జెట్ కేటాయింపులు జరిగాయన్నారు. గత వారం రోజులుగా తెనాలిలో నిర్వహిస్తున్న 3వ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. చివరి రోజు ఆసరా సంబరాలు పట్టణ 25,26,27,28,29 వార్డుల పరిధిలో పినపాడులోని వాటర్ ట్యాంక్ సమీపంలో జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అధ్యక్షత వహించారు. వార్డుల్లోని 2033 మంది స్వయం సంహాయక సంఘాల మహిళలకు రూ.1.61 కోట్ల చెక్కును ఎమ్మెల్యే శివకుమార్ అందజేశారు. సభలో మాట్లాడుతూ, డ్వాక్రా సంఘాలు గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమయ్యాయని చెప్పారు. రుణమాఫీ హామీనిచ్చి కూడా గత ప్రభుత్వం నెరవేర్చలేదని గుర్తు చేశారు. డ్వాక్రా మహిళలకు ఆర్థిక తోడ్పాటు అవసరమని భావించిన అప్పటి ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, రుణమాఫీకి హామీనిచ్చి, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం నిలుపుకుంటున్నట్టు చెప్పారు. ఆసరాతోపాటు ప్రతి సంక్షేమ పథకాన్నీ మహిళ పేరుతో ఇస్తూ ఏరకంగా ప్రభుత్వం తోడుగా ఉందో ఆలోచించాలన్నారు. ఆసరాకు తోడుగా అమ్మ ఒడి కింద తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు వేస్తున్నామని చెబుతూ బడికి వెళ్లే పిల్లలకు నాణ్యమైన విద్య కోసం నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. పిల్లలకు యూనిఫారం, బూట్లు, మినరల్ వాటర్ సహా ఇస్తున్నామని, గతంలో స్కూళ్లు ఎలా ఉండేవి..మూడున్నరేళ్లుగా ఎలా అభివృద్ధి చెందిందీ పరిశీలించాలని చెప్పారు. గ్రానైట్ ఫ్లోరింగ్, నాణ్యమైన బెంచీలు, గ్రీన్ బోర్డు ఏర్పాటు, డిజిటల్ ఎడ్యుకేషన్ కోసం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశామని తెలిపారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఎండాకాలంలో పోషక విలువలతో కూడిన రాగి జావను వారంలో మూడు రోజులు ఇస్తున్నామని గుర్తు చేశారు. మహిళలు కుటుంబాన్ని తీర్చిదిద్దుకుంటూ బిడ్డల్ని చదివించుకుంటున్నారని చెప్పారు. పేద మహిళలతోపాటు చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన వితంతువులు, ఒంటరి మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధి ఎంతగానో భరోసానిస్తోందని తెలియజేశారు. ఇచ్చిన మాటను నిలుపుకుని, బతుకుబండిని సజావుగా ముందుకు సాగేలా చేసిన ముఖ్యమంత్రి జగన్‌ను, తననూ ఆశీర్వదించమని ఎమ్మెల్యే శివకుమార్ కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, షేక్ ఇస్మాయిల్, యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, పార్టీ నేతలు బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆసరా సభలను చక్కగా నిర్వహించిన 'మెప్మా' మాధవరావు, అరుణ, సిబ్బందిని ఎమ్మెల్యే సత్కరించారు.

ఆటోల డిజిటలైజేషన్‌లో అలసత్వం

- నేర పరిశోధనలో కీలకం
- అధికారుల నిర్లక్ష్యంతో అటకెక్కిన ప్రక్రియ



మూతపడిన మార్కెట్‌లోని నమోదు కేంద్రం

తెనాలి రూరల్: ఆటోల సమగ్ర వివరాల్ని నమోదు చేసి, కంప్యూటరీకరించేందుకు ఏర్పాటు చేసిన డిజిటలైజేషన్ అటకెక్కింది. ప్రక్రియ ప్రారంభించి ఐదేళ్లయినా కనీసం 20 శాతం వివరాలు నమోదు కాలేదు. తెనాలి పట్టణంలో తిరిగే, పరిసర గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే ఆటోల సంఖ్య దాదాపు ఐదు వేలు ఉంటుందని అంచనా ఉంది. తరచూ ఆటోల్లో లగేజీ, ఇతర వస్తువులు చోరీ వంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అంతేకాక నేరం చేసిన అనంతరం నిందితులు ఆటోల్లో పరారయిన ఘటనలూ ఉన్నాయి. ఇటువంటి కేసుల దర్యాప్తు కొంత క్లిష్టంగా కూడా ఉంటోంది. ఆటోకి రవాణా శాఖ కేటాయించిన రిజిస్ట్రేషన్ నంబరును గుర్తిస్తేనే దర్యాప్తు త్వరితగతిన పూర్తయ్యేది. కనబడీ కనబడని విధంగా నంబర్ ప్లేట్లు ఉండడం సమస్యగా మారుతోంది. దీనికి చెక్ పెడుతూ పరిష్కారంగా కొన్నేళ్ల కిందట ఆటోల వివరాలను పోలీసులు నమోదు చేసి, వరుస క్రమ సంఖ్య ఇచ్చారు. ఆటో యజమాని, డ్రైవర్ వివరాలు పోలీసుల వద్ద ఉండేవి. కేటాయించిన క్రమసంఖ్యను ఆటోలో ముందు, వెనుక వైపులా స్పష్టంగా కనబడే విధంగా స్టిక్కరింగ్ వేయించేవారు. దీంతో కొంత వరకు కేసుల దర్యాప్తు సునాయాసమైంది.

అటకెక్కిన కంప్యూటీకరణ

ప్రస్తుతం టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో ఆటోల నమోదు ప్రక్రియను డిజిటలైజ్ చేసేందుకు పోలీసు శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రత్యేక పోర్టల్‌లో వివరాల్ని నమోదు చేయడం ప్రారంభించారు. ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వివరాలను తెలుసుకుని, పోలీసుల శాఖ ఆటోకొక సీరియల్ నంబరు కేటాయించింది. యజమాని, డ్రైవర్, వివరాలు, ఆధార్, ఫోన్ నంబర్ల వంటి వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, అవసరమైనప్పుడు సహాయం కోసం ప్రయాణికులు పోలీసు శాఖకు చేయాల్సిన ఫోన్ నంబర్లు వంటి వివరాలతో కూడిన స్టిక్కర్‌ను తయారు చేయించింది. దీనిపై క్విక్ రెస్పాన్స్(క్యూఆర్) కోడ్‌ను ముద్రించారు. స్టిక్కర్‌ను ఆటోలోపలి వైపున డ్రైవర్ వెనుక భాగంలో ప్రయాణికులకు స్పష్టంగా కనబడే విధంగా ఉంచాలి. పోలీసులు కేటాయించిన సీరియల్ నంబరును సైతం అంటించాల్సి ఉంది. ఏదైనా ప్రమాదం సంభవించినా, ప్రయాణికులు ప్రమాదం శంకించినా, ఆటో వెళుతున్న దారిపై అనుమానం కలిగినా వెంటనే ఆ స్టిక్కర్‌పై ఉన్న నంబరుకు ఫోన్ చేస్తే తక్షణమే పోలీసు శాఖ స్పందిస్తుంది. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోంది. స్టిక్కర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటోకు సంబంధించిన వివరాలన్నీ తెలుస్తాయి. రాత్రి వేళల్లో ప్రయాణించే వారు, ఒంటరిగా వెళ్లాల్సి వారు ఆటో వివరాల్ని తమ కుటుంబసభ్యులు, స్నేహితులకు తెలియజేస్తే, ఏదైనా అనుకోని ఘటన జరిగప్పుడు వెంటనే స్పందించే వీలు కలుగుతుంది. నేరాలు జరిగితే కేసుల దర్యాప్తును సునాయాసం చేయడంతో పాటు ప్రయాణికులకు భద్రతతో పాటు భరోసా ఇవ్వడం, ఎన్ని ఆటోలు ఉన్నాయన్న కచ్చితమైన సంఖ్య తెలుసుకోగలగడం ఈ డిజిటలైజేషన్ ముఖ్య ఉద్దేశం.

డిజిటలైజేషన్ నత్తనడక

తెనాలిలో ఈ డిజిటలైజేషన్ కేంద్రాన్ని మార్కెట్‌లో గాడిబావి సెంటరు వద్ద ఏర్పాటు చేశారు. అప్పటికే ఉన్న పోలీస్ సబ్ కంట్రోల్‌ను ఈ– కేంద్రంగా మార్చు చేశారు. ఐదేళ్లయినా ఇప్పటికీ వెయ్యి ఆటోలనైనా నమోదు చేయలేదు. డిజిటలైజేషన్ పూర్తి చేయడంతో ఆటోల సంఖ్య పూర్తిగా తెలియడం ద్వారా పట్టణంలో క్లిష్టంగా ఉన్న ట్రాఫిక్ సమస్యనూ పరిష్కరించే అవకాశం ఉంటుంది. ఇన్ని రకాల ప్రయోజనాలున్న డిజిటలైజేషన్ ప్రక్రియను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బంది కొరత



ఆటోల డిజిటలైజేషన్ ప్రక్రియ మంచిదే. దాని వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. గతంలో వివరాలు నమోదు చేపట్టారు. తరువాత జరిగిన కొన్ని పరిణామాల వల్ల నిలిపివేశారు. ప్రస్తుతం సిబ్బంది కొరత ఉంది. బందోబస్తు విధులకు పంపాల్సి వస్తోంది. ఇదీ కూడా ఒక కారణం.

– జోగి శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్‌ఐ

సెలవుల కల్పనపై సచివాలయ ఉద్యోగుల హర్షం



సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జోసెఫ్ కిశోర్

తెనాలి: డెమొక్రాటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ/వార్డు సచివాలయం ఎంప్లాయిస్ (ఏపీజీఎస్‌డబ్ల్యుస్) ఉద్యోగులకు అన్ని రకాల సెలవుల్ని కల్పించినందుకు అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కార్యదర్శి జి.జోసెఫ్ కిశోర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కె.త్రివిక్రమాదిత్య గురువారం రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతిపత్రం ఇచ్చినట్టు తెలియజేశారు. త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రామకృష్ణారెడ్డి వెల్లడించినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ పనితీరును ఆయన అభినందించినట్టు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గోగులమ్మకు నైవేద్యం



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మ ఆలయ వార్షిక మహోత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాలను యాజ్ఞికులు ఆమంచి సృజన్ కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు దీవి రాంబాబు, దీవి గోపాల కృష్ణమాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారికి రూ.1.50 లక్షల వెండి పూజా సామగ్రి అందజేశారు. విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కాలనీవాసులకు ఆహార పొట్లాల పంపిణీ



తెనాలి: పేదలకు తోడ్పడటం గొప్ప విషయమని, అటువంటివారికి దేవుడి ఆశీర్వాదం తప్పక ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా నేత కఠారి హరీష్ అన్నారు. శ్రీసాయి ప్రసాదం సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం డొంకరోడ్డులోని పూలే కాలనీలోని 200 మంది పేదలకు ఆహార పొట్లాల్ని పంపిణీ చేశారు. కఠారి హరీష్ ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకుల్ని అభినందించారు. షణ్ముఖ సాయిశ్రీ జన్మదినం సందర్భంగా ఈ అన్నప్రసాద వితరణ చేసినట్టు సేవాసమితి నిర్వాహకుడు సాయి లక్కరాజు చెప్పారు. కార్యక్రమంలో ఆర్.సురేష్, అఖిల్, విమల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆడపడుచులకే అగ్ర తాంబూలం

- రాష్ట్రంలో మహిళా రాజ్యం పరిపాలన
- అన్నగా సీఎం జగన్‌ను ఆశీర్వదించండి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాద్ తదితరులు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ రంగంలోనైనా ఆడపడుచులకే అగ్రతాంబూలం ఇస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లో రీజనల్ కార్యాలయంలో గురువారం జగనన్న నవ్యోత్సవాల్లో భాగంగా 'జగనన్న పాలనలో మహిళా సాధికారిత' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ అధ్యక్షత వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ మహిళలకు అన్నగా అండగా ఉంటానని భరోసానిస్తున్న సీఎం జగన్‌ను మహిళా లోకం మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా నేత నూరిఫాతిమా మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇచ్చిన ప్రతి మాటతో పాటు, ఇవ్వని ఎన్నో హామీల్ని సైతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు బత్తుల అనూరాధ, చంద్రగిరి కరుణకుమారి, బొడ్డుపల్లి పద్మజ, మేరిగ విజయలక్ష్మి, మల్లిబోయిన శ్రీవల్లి, మనోరంజని, వనజాక్షి, విజయ మాధవి, పిల్లి మేరి, మాదా రాధాకృష్ణ, కళ్లం హరికృష్ణారెడ్డి, నాలారి ప్రభాకర్, వి. ఓంప్రకాష్‌రెడ్డి, అల్లాబక్షు, చెరుకూరి సాంబశివరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్య ఆసరాతో పేదలకు భరోసా



వైఎస్సార్ ఆరోగ్య ఆసరా బుక్స్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

కొల్లిపర: వైఎస్సార్ ఆరోగ్య ఆసరాతో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని ఎంపీడీవో పి.శ్రీనివాసులు, మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసుధ, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అధికారులు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ అధికారులు మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు సార్వత్రిక ఆరోగ్య కవరేజీని అందించడం ట్రస్ట్ ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా రోగులు శస్త్రచికిత్సలు చేయించుకొనే నిమిత్తం రోజుకు రూ.225 గరిష్టంగా నెలకు రూ.5000 భృతి ఇవ్వనున్నట్లు వివరించారు. రోగులు డిశ్చార్జి అయిన తేదీ నాటికి వారి ఖాతాల్లో ఆసరా మొత్తం జమ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ అవగాహన బుక్స్‌ను ఏఎన్ఎమ్‌లకు అందించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఈవోపీఆర్డీ సమతావాణి పాల్గొన్నారు.

ప్రియుడి హత్య కేసులో ప్రియురాలి అరెస్టు

తెనాలి రూరల్: ప్రియుడి హత్య కేసులో ప్రియురాలిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ చెంచుపేటలో నివసించే పెయింటర్ గద్దె రాము(29)ను అతనితో సహజీవనం చేస్తున్న సత్తెనపల్లికి చెందిన తస్నీరు ఆమని గత నెల 30వ తేదీ అర్ధరాత్రి దాటాక గొంతు కోసి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితురాలిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు.

స్వాగత సుమాంజలి



చిలకలూరిపేటలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ని ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శివకుమార్

రేడియో ఆర్టిస్ట్ బ్రహ్మయ్యకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం సాహసవంతుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం సంగీతలక్ష్మి చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం రేడియో ఆర్టిస్ట్ ఆరమండ్ల బ్రహ్మయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, ఉమ్మలనేని ధర్మారావు, చిన్ని కృష్ణ చైతన్య, చిన్ని సంపత్, కొండూరు శివప్రసాద్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, నల్లూరి శ్రీనివాస్, పెద్దిటి యోహాను, ముళ్లపూడి వెంకట్, దేవరపల్లి భవాని పాల్గొన్నారు.

చరిత్రలో నూతన అధ్యాయం ఫ్యామిలీ డాక్టర్

ఎమ్మెల్యే శివకుమార్



నందివెలుగులో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానం రాష్ట్ర చరిత్రలో నూతన అధ్యాయాన్ని సృష్టిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం నందివెలుగులోని ఆరోగ్య కేంద్రంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సభకు కొలకలూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్.వి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం ఎంతో సాహసోపేత నిర్ణయమని తెలిపారు. మారుమూల గ్రామాల్లోని పేదలకు వైద్య సేవలు అందించవచ్చని చెప్పారు. దేశంలోని పలు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని, ప్రజలు ముంగిటకు పరిపాలన వెళ్లినట్లు తెలిపారు. జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతో గొప్ప కాన్సెప్ట్ అని, ప్రజలు వద్దకు వైద్యులు వెళ్లడం ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్, తహసీల్దార్ కె.రవిబాబు, ఎంఈవో ఎం.లక్ష్మీనారాయణ, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ దిలీప్, పంచాయతీ కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, సొసైటీ చైర్మన్ తోటకూర వసంతరావు, వేముల మహేష్, బెజ్జం బాజి, తస్నీరు వెంకటేశ్వరరావు, నరేంద్రరెడ్డి, కసుకుర్తి దానియేలు, కమాదుల స్వామి, కాసుగోలు సురేష్, చీళ్ల శాంతిరాజు, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, లక్ష్మీ ప్రసన్న, నాగరాజు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నందివెలుగులో ఇఫ్తార్ విందు

నందివెలుగులో ఎంపీటీసీ సభ్యుడు షేక్ షిలార్ జానీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎంపీపీ శ్రీనివాసరావు, సర్పంచ్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి



సిమెంటు బెంచీపై భాస్కరరావు మృతదేహం

తెనాలి రూరల్: కట్టుకున్న భార్య ఎప్పుడో కాలం చేసింది.. కనిపెట్టుకుని ఉంటున్న కుమార్తె కొంత కాలం కిందట మృతి చెందింది.. ఆశ్రమాల్లో ఉంటున్నా తనకు ఆదరణ దొరకలేదని భావించాడు.. ఎవరికీ తెలియకుండా ఆశ్రమం నుంచి బయటకు వచ్చేసిన ఎన్టీఆర్ జిల్లా నిడమానూరుకు చెందిన వృద్ధుడు గొల్లపూడి భాస్కరరావు(76) గురువారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. తెనాలి మండలం కొలవరం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సిమెంటు బెంచీపై భాస్కరరావు మృతి చెంది పడి ఉండటాన్ని గ్రామస్తులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకుని పోలీసులు అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో మధ్యాహ్నానికి వారు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తమతో తీసుకు వెళ్లారు. నిడమానూరుకు చెందిన భాస్కరరావు గతంలో వ్యవసాయం చేస్తూ ఉండేవాడు. భార్య, ఇద్దరు కుమార్తెలు. 30 ఏళ్ల కిందటే భార్య చనిపోగా, కొంత కాలం కిందట ఓ కుమార్తె కూడా మృతి చెందింది. మరో కుమార్తె, అల్లుడుతో భాస్కరరావుకు సఖ్యత లేక దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గత పదేళ్లుగా పాల్వంచ, ఖమ్మం, చిల్లకల్లు, విజయవాడ, భద్రాచలం ప్రాంతాల్లోని ఆశ్రమాల్లో కాలం గడపుతూ వస్తున్నాడు. ఈ మధ్యలో ఏమైందో ఏమో కానీ పాల్వంచ వృద్ధాశ్రమం నుంచి మూడు రోజుల కిందట ఎవరికీ చెప్పకుండా వచ్చేసిన భాస్కరరావు బుధవారం రాత్రికి కొలవరం చేరుకున్నాడు. అక్కడ సెంటర్లో తిరుగుతుండగా కొందరు గమనించి విచారిస్తే, తమది ఏలూరుగా చెప్పాడు. గురువారం ఉదయానికి గ్రామ సెంటర్లోని పంచాయతీ బల్లపై మృతి చెంది పడి ఉన్నాడు. స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడకు చేరుకుని విచారించారు. వృద్ధుడి వద్ద లభ్యమైన ఫోన్‌లోని నంబర్ల ప్రకారం నిడమానూరులో ఉంటున్న అతడి మేనల్లుడుకి సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో అతడు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని తమతో పాటు తీసుకు వెళ్లారు. వృద్ధుడి నోటిలో నుంచి నురగ వస్తుండటంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక అనారోగ్యంతో మృతి చెందాడా ? అన్నది స్పష్టత లేదు. అయితే, దీనిపై ఇంకా పోలీసు కేసు నమోదు కాలేదు.

AVR COLLEGE OF EDUCATION
Opp: R.T.C. Bustand Out Gate, Tenali
Admission Notification for B.Ed. MANAGEMENT QUOTA SEATS Category 'B' & SPOT ADMISSIONS

Applications are invited from eligible candidates seeking admission in to B.Ed Course (2 Years) 2022 - 2024 Under Management Quota and Spot Admissions. The Candidates with filled - in applications along with the required certificates in original may approach the undersigned on or before 10-04-2023

08644-229042
94407 51677

Smt. G.ANITHA
Secretary & Correspondent

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)

Office mail : sakshigntadvt@gmail.com